సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కులను అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్ సోమవారం లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యవరస వైద్య ఖర్చులకు పేద, బడుగు, బలహీన వర్గాలకు వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆదుకుంటుందన్నారు. ఆపదలో ఉన్న వారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. రూ. 9.54 లక్షలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.

విశ్వేశ్వరయ్య ఆశయాల సాధనకు కృషి చేయాలి



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: తొలితరం ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇంజనీర్స్ డే సందర్భంగా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) క్యాంపస్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలను ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు, అధికారులు, ఉద్యోగులు, ఫ్యాకల్టీ వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. విశ్వేశ్వరయ్య అమర్ రహే, విశ్వేశ్వరయ్య ఆశయాల సాధనకు చిత్తశుద్ధితో కృషిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ... తొలితరం మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ప్రతి ఒక్క ఇంజనీర్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్కీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

టెక్నాలజీ లేని రోజుల్లో దేశానికి సేవలు



విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో కార్పొరేటర్, నాయకులు

పటాన్‌చెరు టౌన్: టెక్నాలజీ లేని రోజుల్లో దేశానికి ఇంజనీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు మరవలేనివని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మైసూరులో కృష్ణరాజ ఆనకట్టకు ఆయన చీఫ్ ఇంజనీరుగా పనిచేశారని, హైదరాబాద్ మూసీనది వరదల నుంచి రక్షించడానికి ఆయనే పథకాలను రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రఘు, అశోక్, పృథ్వీరాజ్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలైట్ బిజినెస్ అవార్డుల ప్రదానం



టీ హబ్‌లో గ్లోబల్ పిన్నాకిల్ ఫౌండేషన్ సంస్థ అవార్డు గ్రహీతలు, అతిథులు

రాయదుర్గం: తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో రాణించిన పలువురిని గ్లోబల్ పిన్నాకిల్ ఫౌండేషన్ సంస్థ ఘనంగా సత్కరించింది. 'ఎలైట్ బిజినెస్ అవార్డులు–2025 కార్యక్రమం'పేరిట అట్టహాసంగా సాగింది. ఆదివారంరాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో 'తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ ఎలైట్ బిజినెస్ అవార్డులు–2025'కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్లోబల్ పిన్నాకిల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రిషిత రుమల్లా, నచికేత్ రుమల్లా పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగింది. గత ఐదేళ్లుగా ఈ సంస్థ ఆయా రంగాల నిష్ణాతులకు అవార్డులను అందిస్తోంది. ఈ ఏడాది కెనడా దేశ మాజీ మంత్రి లీలా అహీర్, అర్జున అవార్డు గ్రహీత అనూప్‌కుమార్ యామా, కేంద్ర ప్రభుత్వ అధికారి ఆదిత్యప్రవీణ్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం లీలా అహీర్ మాట్లాడుతూ ఎవరైనా తాము ఎంపిక చేసుకున్న రంగంలో రాణించడానికి చిత్తశుద్ధి, పట్టుదల, క్రమశిక్షణతో ముందుకుసాగితే విజయం ఖాయమన్నారు. గ్లోబల్ పిన్నాకిల్ ఫౌండేషన్ అందరినీ గుర్తించి ఇలా సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

ఓల్డ్ హఫీజ్‌పేట్‌లోని శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలుగా మారిన దృశ్యం



అంబేడ్కర్ కాలనీ శ్మశానవాటిక ముందు అసంపూర్తి పనులతో ముఖద్వారం



శిలాఫలకాలతో సరి..!



ఓల్డ్ హఫీజ్‌పేట్ శ్మశానవాటిక అభివృద్ధి కోసం రెండు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

అసౌకర్యాల ఊబిలో ఆఖరి మజిలీలు

- రెండేళ్లైనా ప్రారంభంకాని అభివృద్ధి పనులు
- హడావుడిగా శంకుస్థాపనలు.. పురోగతి నిల్
- అధికారులకు ఫిర్యాదు చేసినా కొరవడిన స్పందన



అంబేడ్కర్ కాలనీలోని శ్మశానవాటిలో మరుగుదొడ్ల వద్ద చెత్తాచెదారంగా నిరుపయోగంగా ఉన్న దృశ్యం

చందానగర్: మానవ జీవితంలో ఆఖరిమజిలీ శ్మశానవాటిక అనడం నిర్వివాదాంశం. ఆప్తులు, బంధువులు, స్నేహితులకు ఆఖరి వీడ్కోలు బాధాతప్త హృదయాలతో వచ్చే ఆత్మీయులకు శ్మశానవాటికల్లో కనీస వసతులు కల్పించే విషయంలో పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నాం.. మెరుగైన వసతులు కల్పిస్తాం అంటూ ఆర్భాటంగా ప్రకటిస్తారుకానీ కార్యరూపం దాల్చే విషయంలో మాత్రం మిన్నకుండిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.

- హఫీజ్‌పేట్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో ఉన్న శ్మశానవాటిక అభివృద్ధికి రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ రూ. 98 లక్షల వ్యయంతో కూడిన పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభంకాలేదు. దీంతో స్థానికులు చందానగర్ సర్కిల్ 21లో నిర్వహించిన ప్రజావాణిలో హఫీజ్‌పేట్ డివిజన్‌లో సమస్యలపై ఫిర్యాదులు చేశారు. అయినా స్పందన లేదు.
- 2012లో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ రూ. 20 లక్షలతో అంబేడ్కర్ కాలనీ శ్మశానవాటి కళఅభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినా పనులు పూర్తి కాలేదు.
- ప్రధాన ముఖ ద్వారాల వద్ద గేట్లు లేవు. శ్మశానవాటికలోకి వచ్చే రోడ్డు పూర్తి గుంతలమయంగా మారింది
- ఏపుగా చెట్లు, పిచ్చిమొక్కలు పెరిగడంతో పాములు తిరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు
- చెత్తాచెదారం, మట్టి కుప్పల మధ్యలో ఉన్న మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.
- అసంపూర్తిగా నిర్మించి శ్మశానవాటిక కమాన్‌తో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- అంబేడ్కర్‌కాలనీ శ్మశానవాటికలో స్నానపు గదులు, దహన సంస్కారాలకు ప్రత్యేకంగా దిమ్మెలు ఏర్పాటు చేయాలి.
- నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేసి అందుబాటులోకి తీసుకురావాలి.
- విద్యుత్ దీపాల కోసం స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు బిగించాలి.
- చెత్తాచెదారం, నిర్మాణ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలి.

వెంటనే ప్రారంభించాలి



ఓల్డ్ హఫీజ్‌పేట్ శ్మశానవాటికలో అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి. కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యుద్ధప్రాతిపదిక అభివృద్ధి చేయాలి.

– బోయిని మహేష్ యాదవ్, ఓల్డ్ హఫీజ్‌పేట్

వైకుంఠధామంగా తీర్చిదిద్దాలి



ఎస్సీ శ్మశానవాటిక అభివృద్ధి అభివృద్ధి చేసి వైకుంఠధామంగా తీర్చిదిద్దాలి. దహన సంస్కారాలకు కనీస వసతులు ఏర్పాటు చేయాలి. అంబేడ్కర్ కాలనీ శ్మశానవాటి చుట్టూ ప్రహరీ నిర్మించాలి. చెత్తాచెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలి.

– తలారి రవి ముదిరాజ్, ఓల్డ్ హఫీజ్‌పేట్

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య

మియాపూర్: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మౌనిక సమాచారం మేరకు... మెదక్ జిల్లా అంతేర్‌గాన్ గ్రామానికి చెందిన ప్రదీప్ రావు(34) భార్య శాంతాబాయి ఇద్దరు పిల్లలతో కలిసి మియాపూర్‌లోని పీఏనగర్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా నివాసముంటున్నారు. ప్రదీప్ రావు స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. రెండు నెలల క్రితం పనులు చేస్తుండగా కిందపడి కాలుకు తీవ్ర గాయం కావడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. భార్య శాంతాబాయి స్థానికంగా డెంటల్ క్లినిక్‌లో పనిచేస్తుంది. సోమవారం ఉదయం శాంతాబాయి పనికి వెళ్లగా పిల్లలు పాఠశాలకు వెళ్లారు. ప్రదీప్ రావు ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భార్య శాంతాబాయి పనిముగించుకుని పిల్లలను స్కూల్ నుంచి తీసుకుని ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో పైకప్పు ఇనుపకొండికి ప్రదీప్‌రావు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రదీప్ రావు, శాంతాబాయిలకు ఇద్దరు పిల్లలున్నారు.

'ఛాప్'ను సందర్శించిన శైలజారామయ్యర్

మాదాపూర్: వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఛాప్ 2025ను సోమవారం దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ సందర్శించారు. పాట్నాకు చెందిన కేట ఎంబ్రాయిడరీ, చెన్నైకి చెందిన పులికాట్ లీఫ్ క్రాఫ్ట్ డెమాన్‌స్ట్రేషన్‌ను నిర్వహించారు. పలు రకాల ఉత్పత్తుల అల్లికలపై అవగాహన కల్పించారు. శిల్పారామం ప్రత్యేక అధికారి కిషన్‌రావు చాప్ ఎగ్జిబిషన్‌ను సందర్శించించారు. పులికాట్ లీఫ్ ఉత్పత్తులను ప్రదర్శించారు.

'సేవా పక్షం' బూత్ స్థాయికి చేరాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: ప్రధాని నరేంద్రమోడీ ఆదేశాలపై సేవా పక్షం–2025 కార్యక్రమాలు ప్రతి బూత్ స్థాయికి చేరాలని బీజేపీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మసీదుబండలోని బీజేపీ కార్యాలయంలో సేవా పక్షం కన్వీనర్ రాధాకృష్ణయాదవ్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవనాన్ని, ప్రధాని మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని యువమోర్చా ఆధ్వర్యంలో చేపట్టే నిషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 3కే నమో యువ రన్ కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ప్రతి బూత్‌లో రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బీజేపీ పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ సేవా పక్షం కేవలం పార్టీ కార్యక్రమం మాత్రమే కాదని, ప్రజలకు చేరువ కావడదానికి ఒక మంచి అవకాశమని ఆయన గుర్తు చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసమే బీజేపీ మాత్రమే ప్రత్యామ్నాయం అనేలా కార్య క్రమాలు నిరూపిస్తాయన్నారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్‌ను సన్మానించారు. బీజేపీ నాయకులు మహిపాల్‌రెడ్డి, మూల అనిల్‌గౌడ్, స్రవంతి, దుర్గాప్రసాద్, మణిభూషణ్‌చారి, మాణిక్‌రావు, కృష్ణంరాజు, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్య ఆసియాతో సంబంధాలు విడదీయలేనివి

'మనూ' వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: ఇస్లామిక్ ప్రపంచంలోని మధ్య ఆసియా భాగంతో భారతదేశానికి ఉన్న సాంస్కృతిక సంబంధాలు విడదీయలేనవని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కోల్‌కతాలోని సొసైటీ ఫర్ ది హిస్టరీ ఆఫ్ సైన్స్ సహకారంతో చరిత్ర విభాగం, హెచ్‌కే షేర్వానీ సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో 'సైన్స్ ఇన్ ది దక్కన్: ఏ హిస్టారికల్ అండ్ కాంటెంపరరీ పర్స్పెక్టివ్' అనే జాతీయ సెమినార్‌లో ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముస్లిమ్ ప్రపంచం గొప్ప శాస్త్రీయ వారసత్వాన్ని, సమకాలీన పరిశోధనలకు దాని ఔచిత్యాన్ని నొక్కి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఎస్.కె.మహమూద్ మాట్లాడుతూ... శాస్త్ర చరిత్ర, చరిత్ర అధ్యయనం ప్రాముఖ్యతను వివరించారు. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చరిత్రకు ఎస్‌పి బెనర్జీ స్మారక బహుమతి, వైద్య చరిత్రకు పార్థా ప్రోతిమ్ బందోపాధ్యాయ స్మారక బహుమతిని ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అందించారు. ప్రొఫెసర్ దీపక్‌కుమార్, ప్రొఫెసర్ అట్లూరి మురళి, చరిత్ర విభాగం కన్వీనర్, అధిపతి ప్రొఫెసర్ రఫియుల్లా అజ్మీ, హెచ్‌కే షేర్వాని సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్ కన్వీనర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సల్మా అహ్మద్ ఫారూఖీ, చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖండే పెర్వైజ్ ప్రసంగించారు.

'సర్క్యులర్ ఎకానమీ సెల్' ప్రారంభం

రాయదుర్గం: ప్రకృతి సంపదను విధ్వంసం చేయకుండా ఇంజనీరింగ్ పనులు నిర్వహించినప్పుడే పర్యావరణాన్ని సంరక్షించిన వారమవుతామని కాలిగొట్ల టెక్నాలజీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కాలిగొట్ల వెంకట మురళి అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఇంజనీర్స్ డే సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన 'సర్క్యులర్ ఎకానమీ సెల్'ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ... తొలితరం ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అతి పేద కుటుంబం నుంచి వచ్చారని ప్రపంచమే ఆశ్చర్యపడే సాగునీటి ప్రాజెక్టులు, వందేళ్ల కిందటే కట్టడాన్ని చూసి, వారి ఇంజనీరింగ్ ప్రతిభకు మెచ్చి బ్రిటిష్ ప్రభుత్వం అతన్ని గౌరవిస్తూ 'సర్' అనే గొప్ప బిరుదును ప్రసాదిస్తే, భారత ప్రభుత్వం అత్యున్నతమైన పౌర సత్కారం 'భారతరత్న' బిరుదుతో ఆయనను గౌరవించిందని గుర్తు చేశారు. చీఫ్ ప్రాజెక్టు ఇంజనీర్ డి శ్రీధర్‌బాబు, పవర్ అండ్ ఎనర్జీ హెడ్ ఉబ్బ విద్యాసాగర్, ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతరావు, డిప్యూటీ చీఫ్ డాక్టర్ పి.రాజరావు, డాక్టర్ చంద్రకళ, వెంకట్‌రెడ్డి జ్యోతి, విద్యాసాగర్, అశోక్, ఎం.వి.ఎస్.సాగర్, సాయి కిశోర్, భరత్, అనితా అగర్వాల్, రాజేశ్వరి, నరేష్, సౌమ్య, జ్యోతి ఆది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ



మాట్లాడుతున్న శేరిలింగంపల్లి డీసీ ప్రశాంతి



చందానగర్ సర్కిల్-21లో...

శేరిలింగంపల్లిలో ప్రజావాణి కార్యక్రమం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 10 ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ ఆరు, ఇంజనీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, శానిటేషన్, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్కటిగా వచ్చినట్లు అధికారులు వివరించారు.

చందానగర్ సర్కిల్–21 కార్యాలయంలో...

చందానగర్: చందానగర్ సర్కిల్–21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉపకమిషనర్ శశిరేఖ సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి 17 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో టౌన్ ప్లానింగ్ 15, ఇంజనీరింగ్ 1, యూబీడీ 1 ప్రకారం ఫిర్యాదులు వచ్చాయన్నారు. వెంటనే ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశించారు. ఏఎంసీ మణికరణ్, ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్ డీఈ దుర్గప్రసాద్, ఎంటమాలజీ, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలని దివ్యాంగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితిల సంయుక్తా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, శేరిలింగంపల్లి ఇంచార్జి గణేష్ మాదిగ మాట్లాడుతూ... వికలాంగులకు రూ. 6 వేలు, ఇతర చేయూత పెన్షన్‌లు రూ. 4 వేలు, తీవ్ర వైకల్యం గల వారికి రూ. 15 వేల చొప్పున ఫించన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల అమలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న కొత్త దరఖాస్తుదారులకు దరఖాస్తు చేసుకున్న తేదీ నుంచే ఫింఛన్ అందజేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి శేరిలింగంపల్లి అధ్యక్షుడు దారుగుపల్లి రాజు, ప్రతినిధులు నర్సింహా, రేణుక, నాగులు, రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ ఆలయానికి మరికొంత స్థలం వదిలేయాలి



చిత్తారమ్మ ఆలయం వద్ద సమావేశమైన స్థానికులు

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చిత్తారమ్మ దేవాలయం చుట్టూ భూమిని ప్రైవేట్ సంస్థకు ప్రభుత్వం కేటాయించిందని, అందులో ఆలయ కార్యక్రమాల నిర్వహణకు మరికొంత స్థలాన్ని వదలాలని స్థానికులు కోరుతున్నారు. చిత్తారమ్మ ఆలయం వద్ద స్థానికులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. చిత్తారమ్మ ఆలయ బోనాలు, ఇతర ఉత్సవాల నిర్వహణకు స్థలం అవసరమని అందుకోసం ఆలయ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన స్థలం వదిలేసి నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు సమావేశంలో నిర్ణయించారు. ఆలయ స్థలాన్ని చదును చేయడం ఆపేయాలని వారు కోరారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకొని ఆలయానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు. రంగనాథస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రప్రసాద్‌దూబే, ప్రతినిధులు నర్సింహా, అనీల్, జితేందర్, నర్సింగ్ రావు, సత్యనారాయణ, శంకరిరాజు, రంగస్వామి పాల్గొన్నారు.

మహిళలపై హింస, వేధింపుల నివారణకు సహకరించాలి



డాక్టర్ అర్చన మజుందార్ సన్మానిస్తున్న దృశ్యం

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్

గచ్చిబౌలి: మహిళలపై జరిగే హింసాత్మక చర్యలను వేధింపులను నివారించడానికి తమ వంతూ సహకారం అందించాలని, మహిళలకు అండగా నిలవాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఆమె విచ్చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... మహిళలు వివిధ రకాల సమస్యలతో సతమతమయ్యే బాధిత మహిళలకు అధికార యంత్రాంగం అండగా నిలవాలని, తగిన విధంగా తోడ్పాటు అందించాలన్నారు. మహిళలకు సంబంధించిన కేసులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు కమిషనరేట్ పరిధిలో 56 పెండింగ్ కేసులను పరిస్కరించామన్నారు. గృహ హింస కేసులకు సబంధించిన పోలీసులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మహిళలు 56 వినతులను ఆమెకు అందించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, డీసీపీలు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు హామీని అమలు చేయండి



ర్యాలీగా వెళ్తున్న దివ్యాంగులు, నాయకులు

మహాజన సోషలిస్ట్ పార్టీ నేత వెంకటేశ్

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్లు పెంచాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులతో సోమవారం పటాన్‌చెరు తహసీల్ కార్యాలయంలో వరకు ర్యాలీ నిర్వహించి, కార్యాలయం ఎదురుగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. రెండేళ్లు గడుస్తున్నా హామీని అమలు చేయలేనదని ఆరోపించారు. కార్యక్రమంలో వీహెచ్ పీఎస్ నాయకులు, రవి కుమార్, మహేశ్ యువ చైతన్య సంఘం అధ్యక్షుడు ఇస్నాపూర్ నాగరాజు గౌడ్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు భాస్కర్, బండ్ల కృష్ణ, మణిరత్నం, దివ్యాంగులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

మణికొండ: వట్టినాగులపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వట్టినాగులపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామంలో ప్రధాన రోడ్డు పూర్తిగా గోతుల మయంగా మారి ఇబ్బందులు పడుతున్నామన్నారు. రేడియల్ రోడ్డు పనులు పూర్తి కాకపోవటం, మరమ్మతులు చేపట్టకపోవటంతో నరకయాతన అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. హెచ్‌సీయూ డిపో నుంచి వట్టినాగులపల్లి మీదుగా నార్సింగి వరకు ఆర్‌టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామానికి మంజీరా నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్తగా పైప్‌లైన్ వేసి సరిపడ నీటిని సరఫరా చేయించాలన్నారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గ్రామస్థులు తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.నగేష్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462